ఆ చిరునవ్వు కోసం..

నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు.. వారి మానసిక ఆనందమే దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందనే ఆలోచనతో జిల్లా ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలో.. కామారెడ్డి పట్టణ పోలీసులు పలు సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.
- న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

కామారెడ్డి పట్టణంలో పోలీసుల వినూత్న కార్యక్రమాలు

ఠాణా ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం


చిల్డ్రన్ ప్లేయింగ్ జోన్‌లో ఆడుకుంటున్న చిన్నారులతో ఎస్పీ సింధుశర్మ

పోలీసుస్టేషన్‌లో ప్రజలకు వసతులు కల్పించడం సాధారణమే. కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో మాత్రం ఫిర్యాదుదారులు-కక్షిదారులతో పాటు వచ్చే వారి పిల్లలు సేదతీరేలా ఏర్పాట్లు చేశారు. ఠాణా ఆవరణలో 'చిల్డ్రన్ ప్లేయింగ్ జోన్' ఏర్పాటు చేసి ఔరా అనిపించారు. ఈ చిల్డ్రన్ ప్లేయింగ్ జోన్‌లో పచ్చదనంతో నిండిన ఉద్యానవనం.. దానిలో పిల్లల ఆటవస్తువులను ఏర్పాటు చేసి చిన్నారులకు మానసిక ఉల్లాసాన్ని నింపుతున్నారు.

ప్రభుత్వ బడిని తీర్చిదిద్దారు

పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కామారెడ్డి జిల్లాకేంద్రంలోని గొల్లవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల భవనాలకు రంగులు వేయించారు. విద్యార్థులు కూర్చోవడానికి కుర్చీలను అందించారు. రాత పుస్తకాలను ఉచితంగా ఇచ్చారు. పాఠశాల ఆవరణమంతా జాతీయ నాయకులు, శాస్త్రవేత్తల సందేశాలు, సందేశాత్మక చిత్రాలు గీయించారు. 'సామాజిక బాధ్యత కర్తవ్యంగా భావించాలి. భార్య-పిల్లల పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని గొల్లవాడ పాఠశాల బాగుకోసం ఖర్చు చేశాను. పిల్లల మనసుకు నేరప్రవృత్తి అంటుకోకూడదనే ఠాణాలో 'చిల్డ్రన్ ప్లేయింగ్ జోన్‌'ను ఏర్పాటు చేశాం.' అని కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.


గొల్లవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

తల్లడిల్లి.. తీసుకెళ్లి

భిక్కనూరు మండలం జంగంపల్లి శివారు బీటీఎస్ ప్రాంతంలో జాతీయ రహదారి 44పై బుధవారం రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని కోతి పిల్ల మృత్యువాత పడింది. తోటి వానరాలు చనిపోయిన కోతి చుట్టూ చేరి అరుస్తూ నిలిచాయి. అందులోని ఓ తల్లి కోతి చనిపోయిన కోతిపిల్లను రోడ్డుపై నుంచి తీసుకొచ్చి పక్కనే ఉన్న డ్రైనేజీపై ఉంచింది. అది బతికి ఉందేమోనని దానిని తట్టిలేపింది. ఎంతకూ కదలకపోవడంతో ఆ కళేబరాన్ని వెంట తీసుకెళ్లింది.
– భిక్కనూరు, న్యూస్‌టుడే



ఎల్లారెడ్డి ఏటీసీకి జాగేది?




భూ కేటాయింపులను రద్దు చేసిన రెవెన్యూ అధికారులు

ఈనాడు, కామారెడ్డి

ఎల్లారెడ్డి ఐటీఐని కష్టాలు వీడడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లారెడ్డి ఐటీఐని ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)గా ఆధునికీకరించే చర్యలు చేపట్టింది. కానీ ఇక్కడ ఏటీసీ భవనాల నిర్మాణాలకు కేటాయించిన పది ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు రద్దు చేస్తూ ఇతర సంస్థల నిర్మాణాలకు బదలాయించారు. దీంతో పరిస్థితి మొదటికొచ్చింది.

10 ఎకరాలు ఇచ్చినా..

ఎల్లారెడ్డి పట్టణ శివారులోని 1406 సర్వేనంబరులో పది ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఐటీఐ భవనాల నిర్మాణానికి కేటాయించారు. ప్రభుత్వ భూమిని బదలాయించినట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. దీంతో ఐటీఐ కళాశాల అధికారులు పారిశ్రామిక ఉపాధి శిక్షణామండలికి నివేదించారు. రెండు నెలల కిందట టాటా సంస్థకు చెందిన అధికారులు సైతం స్థల పరిశీలన చేసి ఏటీసీ భవనాల నిర్మాణాలను ప్రతిపాదనలు రూపొందించారు. త్వరలో నిర్మాణాలు ప్రారంభించేందుకు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు నిర్దేశిత భూములను ఇతర సంస్థల నిర్మాణాలకు కేటాయించామని వెల్లడించారు. ఆ స్థలంలో ఏటీసీ భవనాల నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు.


GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF EMPLOYMENT AND TRAINING

From:
Principal(I/c)
Govt. ITI Yellareddy
Dist: Kamareddy

To
The Hon'ble District Collector
Kamareddy District.

Lr. No. C/1406 Land/01/2024, Date:18-10-2024

Respected Sir,

Sub: Estt. Govt. ITI Yellareddy, Kamareddy District – Land allotted in Sy. No. 1406 But same allotted to other Organizations latterly – Pursue the matter – Request – Regarding.

I am herewith submitting a few words for your kind consideration, that Sir, the land which was allotted to Govt. ITI Yellareddy in Sy. No. 1406 in the year 2015, but due to lack of Govt. budget, we are not constructed Govt. ITI building. Now A.T.C. (Advanced Technology Centre) sanctioned to this ITI Yellareddy and they are ready to construct ATC building in the allotted land.

But, we are approached to the MRO Yellareddy for permission to construct ATC building, MRO Yellareddy says that the same land is again allotted in Sy. No. 1406 to the Court Building in the year 2020, and also allotted to Tribal welfare society in the year 2021.

Kindly pursue the matter and allot the land to Govt. ITI Yellareddy for construct ITI building / ATC building.

Thanking you sir,

OFFICE OF THE COLLECTOR
18 OCT 2024
KAMAREDDY

Encl.
1. Panchanama Copy
2. Tounch map
3. Proposed ATC building Plan Copy.

Principal (I/c)
Govt. ITI Yellareddy
PRINCIPAL
Govt. Industrial Training Institute
Sathelly Base, YELLAREDDY
Dist: Kamareddy-503 122
Mobile: 80741 98398.

భూ కేటాయింపులను పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్‌కు ఐటీఐ అధికారులు రాసిన లేఖ

ఆరు కోర్సులకు అవకాశం

ఏటీసీ నిర్మాణానికి టాటా సంస్థ రూ.25 కోట్ల మేర వ్యయం చేయనుంది. శిక్షణకు అవసరమైన పరికరాలు, సామగ్రిని అందుబాటులోకి తెస్తోంది. అరకొర వసతులతో ప్రస్తుతం కొనసాగుతున్న ఐటీఐకి ఏటీసీతో ప్రయోజనం కలిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా శాశ్వత ఇన్‌స్ట్రక్టర్లు లేక ప్రస్తుతం ఐటీఐలో రెండు కోర్సుల్లో ప్రవేశాలకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఏటీసీ ఏర్పాటైతే ఆరు కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

ఎమ్మెల్యే చొరవ తీసుకుంటేనే..

పట్టణ శివారులోని 1406 సర్వే నంబరులో 225 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. ఐటీఐకి కేటాయించిన పది ఎకరాల స్థలంలో ఐదు ఎకరాలను న్యాయస్థానం నిర్మాణానికి, మరో ఐదు ఎకరాలను ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహం నిర్మాణం నిమిత్తం కేటాయించారు. అయినా ఈ సర్వేనంబర్‌లో వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవ తీసుకుని ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఏటీసీ భవనాల నిర్మాణాలకు భూ కేటాయింపులు చేయాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్‌కు నివేదించాం

ఏటీసీ భవన నిర్మాణాలకు కేటాయించిన భూములను రెవెన్యూ అధికారులు రద్దుచేసిన అంశాన్ని కలెక్టర్‌కు నివేదించాం. భూ కేటాయింపుల అనంతరం సర్వేయర్‌తో హద్దులు నిర్ధారించి తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని సైతం తీసుకున్నాం. ఐటీఐకి కేటాయించిన స్థలాన్ని ఎటువంటి సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు రద్దు చేశారు.
- ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్, ఐటీఐ, ఎల్లారెడ్డి

29న బీసీ కమిషన్ బృందం రాక

కామారెడ్డి కలెక్టరేట్ : స్థానిక సంస్థల రిజర్వేషన్లపై అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఈ నెల 29న నిజామాబాద్‌కు బీసీ కమిషన్ బృందం రానున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం పేర్కొన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి, సురేందర్, బాలలక్ష్మి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తికలిగిన వారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా కమిషన్‌కు అందజేయవచ్చని తెలిపారు.

ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అన్వేషించాలి

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: సహకార సంఘాలు కేవలం ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చే ఆదాయంపై దృష్టి పెట్టకుండా ప్రత్యామ్నాయ వ్యాపార మార్గాలు అన్వేషించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. నిజామాబాద్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం నిల్వలకు అవసరమైన గోదాములను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, సంస్థ ఎండీ అన్నపూర్ణమ్మ, డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, మార గంగారెడ్డి, ముప్ప గంగారెడ్డి, తారాచంద్ పాల్గొన్నారు.

25 నుంచి రైల్వే గేటు మూసివేత

ఇందూర్ సిటీ, డిచ్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే : నిజామాబాద్ రైల్వే స్టేషన్, డిచ్‌పల్లి మధ్య ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్(మాధవనగర్ గేట్) ఈ నెల 25 నుంచి 27 వరకు మూసి వేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే నిజామాబాద్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ నాగభూషణాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గేటు వద్ద జరుగుతున్న మరమ్మతులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అటుగా వచ్చే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ మీదుగా మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. పనుల నిర్వహణలో అంతరాయం లేకుండా చూడాలని నాలుగో ఠాణా పోలీసులను కోరారు.

కొనుగోళ్లకు మార్గం చూపండి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నేతలు

ఈనాడు, నిజామాబాద్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకున్నా కాంటాలు వేయటం లేదు. రైతుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో ఉమ్మడి జిల్లా నేతలు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం భేటీ అయ్యారు. వరి కోతలు ఊపందుకున్న పరిస్థితిని మంత్రికి వివరించారు. ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు అందక కాంటాలు వేయలేకున్నామన్నారు. కేంద్రాల వద్ద రైతులు ధాన్యం ఆరబెడుతున్నారని.. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించకుంటే వర్షాలు కురిసి తడిచి నష్టపోతారని మంత్రికి వివరించినట్లు సమాచారం.

మిల్లర్ల ప్రస్తావన లేకుండానే..

మిల్లర్లతో ఒప్పందాలు మినహా మిగతా అన్ని అంశాల్లో సిద్ధమైనట్లు అధికారులు, ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. మిల్లర్ల విషయంలో ఇంకా నిర్ణయం జరగకపోవటంతో కొనుగోళ్లకు ఆటంకం తలెత్తుతోందని ప్రస్తావించారు. కొనుగోళ్లు ప్రారంభిస్తే.. ధాన్యం ఎక్కడికి తరలించాలనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మిల్లులకు తరలించే అవకాశం లేకపోవటంతో పౌరసరఫరాల సంస్థ ఈ సారి ప్రత్యామ్నాయంగా మార్కెటింగ్ శాఖకు చెందిన, ప్రైవేటు గోదాములను సిద్ధం చేసుకొని ఉంచింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయానికి వచ్చారు. ప్రజాప్రతినిధులు కూడా జిల్లా అధికారులకు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లర్లతో ఒప్పందాలు జరిగే వరకు మార్కెటింగ్‌శాఖ గోదాముల్లో భద్రపరచాలని చెప్పారు. ఈ నెల 26న మిల్లర్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయం ప్రకటించే వరకు ఈ విధానం అమలు చేయాలన్నారు. ఇరుజిల్లాల డీఎంలు, డీఎస్‌వోలు పాల్గొన్నారు.


సమావేశమైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతరావు, అధికారులు


అధికారులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

'గిరిజనులపై దాడులు సహించం'

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజనులను అకారణంగా ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. పంట భూముల విషయమై గతంలో అధికారులు తమను ఇబ్బందులకు గురి చేశారని గిరిజన రైతులు కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు మండలంలోని కోనాపూర్‌లో ఆయన పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. 2021లో గిరిజనులకు ఎదురైన సమస్యలపై అధికారులతో చర్చించారు. స్థానిక నాయకుల అండదండలతో అటవీ శాఖ అధికారులు, పోలీసులు గిరిజనులపై దాడులు చేసి తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని నిలదీశారు. ఆర్వోఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం గిరిజన రైతులు 2005 కంటే ముందు వరకు పంట సాగు చేస్తే పోడు పట్టాలివ్వాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వరప్రసాద్, డీఎస్పీ సత్యనారాయణ, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ప్రొవైడర్ల నియామకాలు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంహెచ్ఎల్‌పీ/సీహెచ్‌వో) ఉద్యోగాల భర్తీ ప్రక్రియ బుధవారం కొనసాగింది. ఈ పోస్టుల భర్తీకి 184 దరఖాస్తులు రాగా. . రోస్టర్ కమ్ మెరిట్ ప్రతిపాదికన ఎంపిక చేసిన 24 మంది అభ్యర్థులు భర్తీ ప్రక్రియకు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ ఛాంబర్‌లో ప్రక్రియ కొనసాగింది. ఇందులో 11 మందిని ఎంపిక చేశారు. వారికి కలెక్టర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం తగదు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పిల్లలకు పోషకాహారం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డిలో క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 59 కేంద్రాల్లో తగిన వసతులు లేవన్నారు. మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పురపాలక మెప్మా అధికారులు, రిసోర్స్‌పర్సన్లతో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రుణ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.


క్యాంపు కార్యాలయంలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

బసవేశ్వరుని ఆశయాలు ఆచరణీయం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : బసవేశ్వరుని ఆశయాలు, సిద్ధాంతాలను ఆచరణలో పెడుతూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వీరశైవ లింగాయత్ సంఘం నేత ఖందారే దిగంబరు సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని లింగారెడ్డిపేట చౌరస్తా వద్ద బుధవారం బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దిగంబరు హాజరై ప్రసంగించారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సోమలింగ శివాచార్య, మల్లికార్జున శివాచార్య, సిద్ధ దయాల్ శివాచార్య, ముత్తి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.


బసవేశ్వర విగ్రహావిష్కరణలో పాల్గొన్న అతిథులు

ఇందూరులో ఇంజినీరింగ్ కళాశాల అత్యవసరం
గడువు సమీపిస్తోంది ...6లో

అయ్యో పాపం..

చేజారిన మెడిసిన్ సీటు

ఈనాడు, కామారెడ్డి

వైద్య విద్యనభ్యసించి నిరుపేదలకు సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది ఎల్లారెడ్డికి చెందిన మేరుగు సాయిహర్షిత. పేదరికం, స్వల్ప వైకల్యం ఉన్నా లెక్క చేయకుండా అకుంఠిత దీక్షతో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఎటువంటి శిక్షణ లేకుండా సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకుని ప్రవేశ పరీక్ష నీట్ రాసింది. పీడబ్ల్యూడీ కోటాలో 3894వ ర్యాంకు సాధించింది. 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనే' చందంగా ఇటీవల నిర్వహించిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో సీట్ సాధించే ర్యాంకు వచ్చినా.. చేతి వేళ్ల వైకల్యం కారణంగా అధికారులు ప్రవేశానికి నిరాకరించారు.

కుడి చేతి వేళ్లలో పటుత్వం లేకపోవడంతో వైద్యవిధాన మండలి నిబంధనల ప్రకారం ప్రవేశానికి అనుమతి నిరాకరించినట్లు విద్యార్థిని తల్లి సునీత పేర్కొన్నారు. నిమ్స్ వైద్యశాలలో ధ్రువపత్రాల పరిశీలనతో పాటు వైకల్యం నిర్ధారణకు అవసరమైన పరీక్షలు నిర్వహించినప్పటికీ ఫలితాలను వెల్లడించలేదని ఆమె వాపోయారు. నిబంధనలు సడలించి తన బిడ్డకు ప్రవేశం కల్పించేందుకు చొరవ తీసుకోవాలని ఆమె కోరుతున్నారు.

అన్ని పనులు చక్కబెడుతూ... : ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హర్షిత కుడి చేతి మూడు వేళ్లు.. పుట్టినప్పటి నుంచి పని చేయడం లేదు. ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని కారణంగా ఎడమ చేతితో అన్ని పనులు చక్కపెట్టుకుంటూ ముందుకు కదిలింది. ప్రస్తుతం ఆ సమస్యే వైద్య విద్యకు దూరం చేస్తోంది. ప్రజాప్రతినిధులు, యంత్రాంగం స్పందించి తన సమస్యను పరిష్కరించాలని ఆ విద్యార్థిని వేడుకుంటోంది.


తన రెండు చేతి వేళ్లను చూపుతున్న విద్యార్థిని హర్షిత

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణహరి



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన సబ్బని కృష్ణహరి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామకపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. చేనేతల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బుధవారం జిల్లా కేంద్రం నుంచి బయలుదేరారు. మూడు రోజుల పాటు గజ్వేల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల విభాగాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. శిక్షకుడు, మేనేజర్‌గా ఈశ్వర్ వ్యవహరించనున్నారు.



పోటీలకు వెళ్తున్న క్రీడాకారులతో అధికారులు

28న ఉమ్మడి జిల్లా మహాసభ

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 28న మాదిగల ధర్మ యుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభ కామారెడ్డిలో నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి పేర్కొన్నారు. నగరంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, రమేష్, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇందూరులో ఇంజినీరింగ్ కళాశాల అత్యవసరం

☛ ఈనాడు-ఈటీవీ రౌండ్‌టేబుల్ సమావేశంలో తల్లిదండ్రులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం, సుభాష్‌నగర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక రాష్ట్రంలోనూ పదేళ్లుగా ఉమ్మడి జిల్లా నిరాదరణకు గురైంది. మనకంటే చిన్న జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు నెలకొల్పి జిల్లాను నిర్లక్ష్యం చేశారు. రాజకీయంగా రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు చేపట్టినా.. సాంకేతిక ఉన్నత విద్యలో ముందుచూపు లేక మన విద్యార్థులకు తీరని నష్టం చేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పది పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నతీకరించేందుకు నిర్ణయించినా ఈ విద్యాసంవత్సరం అమలుకు నోచుకోలేదు. స్థానిక విద్యార్థుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కళాశాల ఏర్పాటుపై తక్షణమే జీవో విడుదల చేయాల్సిన అవసరముంది. వచ్చే ఏడాది నుంచైనా ప్రవేశాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చేశారు. కళాశాల ఏర్పాటుకై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సాధన దిశగా అడుగులు వేద్దామని నిర్ణయించారు.

తెవివిలోనే నెలకొల్పాలి : భూమన్న, నిజామాబాద్

జిల్లాలో పీజీ కళాశాల ఏర్పాటు కోసం పోరాటం చేయాల్సి వచ్చింది. పేద విద్యార్థులకు సాంకేతిక ఉన్నత విద్య దగ్గర చేసేందుకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకూ పోరాటాలు చేయాల్సి ఉంది. నగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే భవనాలు నిర్మించడంతో ఇరుకుగా మారింది. అందుకే అన్ని వసతులున్న తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

జిల్లా నేతలు చొరవ చూపాలి : మోహన్‌రావు, నిజామాబాద్

ప్రైవేటు కళాశాలల్లో చదివించడంతో తల్లిదండ్రులం అభద్రతకు గురవుతున్నాం. మా కూతురు హైదరాబాద్‌లో వసతి గృహంలో ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. బయట ఎలాంటి దుర్ఘటనలు విన్నా భయంగా ఉంటుంది. జిల్లా కేంద్రంలో కళాశాల ఉంటే ఇంటి నుంచే వెళ్లే అవకాశం ఉంటుంది. జిల్లా నేతలు ఉన్నత పదవులు చేపట్టినా ఇంజినీరింగ్ విద్యపై చొరవ చూపలేదు.

కనీసం రెండైనా కావాలి

- మోహన్, విద్యార్థి తండ్రి, నిజామాబాద్

నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉన్నతీకరణతో పాటు తెలంగాణ వర్సిటీలోనూ ప్రారంభించాలి. అప్పుడే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తే సాధ్యమవుతుంది.

ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలి

- వేణుగోపాల్, నిజామాబాద్

ప్రతిపాదనలు పంపుతున్నా మధ్యలోనే ఆగిపోతున్నాయి. గత ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతో ఎంతో మంది పేద విద్యార్థులకు వైద్యవిద్య చేరువైంది. ప్రస్తుత ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తామనడం అభినందనీయం. కానీ, ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలి.

రూ.10 లక్షలకు పైగానే ఖర్చు

- వివేకానంద, మాధవనగర్, నిజామాబాద్

పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల ఫీజుల కంటే వసతి భారంగా మారింది. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్య పూర్తి చేయాలంటే రూ.10 లక్షలకు పైగానే ఖర్చవుతోంది. జిల్లాలోనే కళాశాల ఫీజులతో పాటు వసతి ఖర్చులు తప్పుతాయి.



రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు

గ్రామీణ విద్యార్థుల ఇక్కట్లు దూరం

- రాజు, నిజామాబాద్

జిల్లాలో కళాశాల లేక ఇతర ప్రాంతాలకు పిల్లలను పంపేందుకు గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు భయపడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే కళాశాలకు వెళ్లి రావడం సులువై ఇక్కట్లు దూరమవుతాయి. కళాశాల ఫీజులు, వసతిగృహ రుసుములు కలిసొస్తాయి.

కమిటీ ఏర్పాటు చేద్దాం

- శివకుమార్, నిజామాబాద్

ఉమ్మడి నిజామాబాద్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో లక్షలు వెచ్చించి ఇతర ప్రాంతాలకు భద్రత లేకుండా పిల్లలను పంపిస్తున్నాం. భవిష్యత్తులో మా మాదిరిగా తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కళాశాల నెలకొల్పాలి. ఈ దిశగా జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చేందుకు ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కలిసిరావాలి.

పేదలు విద్యకు దూరమవుతున్నారు

- గంగాధర్, వినాయక్‌నగర్, నిజామాబాద్

ప్రైవేటులో ఫీజులు చెల్లించలేని ఎంతో మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వ కళాశాల వస్తే ఇబ్బందులు తొలగిపోతాయి. తల్లిదండ్రులంతా పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమ వేదికగా అందరినీ సమన్వయం చేసుకొని పోరాడుదాం.

ఒకటి కాదు.. మూడు అవసరం

- కృష్ణప్రసాద్, గాయత్రినగర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా భౌగోళిక పరిస్థితుల ప్రకారం ఒకటి కాదు మూడు ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసినా తక్కువే. ముఖ్యంగా బాలికలు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదవడానికి కష్టమవుతోంది. మనకంటే చిన్న జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటుచేసేలా నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవచూపాలి. రాబోయే విద్యా సంవత్సరంలో అయినా కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషిచేయాలి.

ఆదరణ కరవు

- డాక్టర్ జయప్రసాద్, నిజామాబాద్

జిల్లాలో ఇంజినీరింగ్ విద్యపై అత్యధిక విద్యార్థులు ఆసక్తి చూపుతున్నా మిగితా జిల్లాలతో పోల్చినప్పుడు ఇక్కడ ఆదరణ కరవైంది. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో మూడు ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయగా.. అంతకంటే ముందే ఏర్పాటైన తెలంగాణ వర్సిటీ పరిధిలో ఒక్కటీ లేకపోవడం బాధాకరం. వచ్చే విద్యాసంవత్సరంలోగా మంజూరు చేయాలి.



అధ్యాపకులతో మాట్లాడుతున్న తెవివి ఉపకులపతి ఆచార్య యాదగిరిరావు

న్యాక్ గుర్తింపునకు కృషి చేయాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయానికి న్యాక్ గుర్తింపు వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య యాదగిరిరావు అన్నారు. ఇటీవల నూతనంగా ఉపకులపతి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన బుధవారం మొదటిసారిగా దక్షిణ ప్రాంగణాన్ని సందర్శించారు. అధ్యాపకులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై సూచనలు చేశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధే లక్ష్యంగా విద్యార్థుల శ్రేయస్సు కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. దక్షిణ ప్రాంగణానికి కావాల్సిన వసతులను ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్ వీసీకి వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వరి, వార్డెన్లు డా.యాలాద్రి, డా.సునిత, అధ్యాపకులు డా.లలిత, డా.హరిత, డా.మోహన్‌బాబు, డా.ప్రతిజ్ఞ, వైశాలి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న కల్యాణ్‌నాయక్

భాజపాతోనే గిరిజనుల హక్కుల సాధన

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: భాజపాతోనే గిరిజనుల హక్కుల సాధన సాధ్యమని గిరిజనమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ అన్నారు. కామారెడ్డిలో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ బిడ్డను రాష్ట్రపతిని చేసిన ఘనత భాజపాకు దక్కుతుందన్నారు. బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. భాజపా జిల్లా ప్రధానకార్యదర్శి బండారి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, పట్టణాధ్యక్షుడు భరత్, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ తదితరులున్నారు.

ఎందుకు తొలగించారో..!

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని టేక్రియాల్ బైపాస్ రోడ్డు నుంచి నర్సన్నపల్లి వరకు రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించారు. ఏడాదిన్నరపాటు శ్రమించి పనులు చేపట్టారు. తాజాగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎదుట పాత జాతీయరహదారిపై డివైడర్‌ను తొలగించారు. ప్రణాళిక ప్రకారం జరిగిన పనులను మధ్యలోనే తొలగింపు చేపట్టడం వివాదస్పదమవుతోంది. ఈ మార్గంలో పెద్దగా వాహనాల రాకపోకలు సాగవు. పైగా ఇక్కడ గృహ నిర్మాణాలు అంతగా లేవు. కొందరు నాయకుల సహకారంతో డివైడర్ నిర్మాణాన్ని ఎందుకు తొలగించారో చర్చనీయాంశమైంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ చిత్రాన్ని 'న్యూస్‌టుడే' బుధవారం క్లిక్‌మనిపించింది.



న్యూస్‌టుడే–కామారెడ్డి పట్టణం

120 చరవాణుల అప్పగింత

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న, దొంగతనాలకు గురైన 120 చరవాణులను సీఈఐఆర్ విధానంలో గుర్తించినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. దేవునిపల్లి పోలీసుస్టేషన్‌లో యజమానులను బుధవారం చరవాణులను అందజేశారు. ఎస్పీ సింధుశర్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్సై వివరించారు.



చరవాణులతో యజమానులు, చిత్రంలో దేవునిపల్లి ఎస్సై రాజు



రాష్ట్రంలో త్వరలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. పూర్వపు ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు ద్వారా ఎమ్మెల్సీని ఎన్నుకుంటారు. గడువు తేదీ(నవంబరు 6) సమీపిస్తున్నా.. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయడంలో వెనకబడిపోతున్నారు.

తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. గతంలో జరిగిన ఎన్నికల సమయంలో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఉమ్మడి జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంచారు. దరఖాస్తుల ప్రక్రియ పర్యవేక్షించడానికి ఓ అధికారిని కూడా నియమించారు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం..

ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పూరించిన దరఖాస్తుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికేట్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలు, ఫోటోను జత చేసి www.ceotelangana.nic.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నవారు

జిల్లా	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
కామారెడ్డి	2762	207
నిజామాబాద్	7495	469

వీరికే అర్హత

2021 అక్టోబరు 31వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఫాం-18 పూరించి నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే చాలు. ఇక ఉపాధ్యాయుల్లో 2018 నవంబరు 1వ తేదీ నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ వరకు మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఫాం-19 పూరించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ ఉపాధ్యాయులు మూడేళ్ల సర్వీసు పూర్తయితే ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు.




28న నిధి ఆప్కే నికత్

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నిధి ఆప్కే నికత్ ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ గణేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రం ఆర్.కే డిగ్రీ, పీజీ కళాశాలలో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి

బిచ్కుంద, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలని డీఐఈవో సలాం పేర్కొన్నారు. బుధవారం బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన కొనసాగుతుందన్నారు. ప్రిన్సిపల్, మోహన్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద: సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సలాం

సీనియర్ సివిల్ జడ్జిగా సుర సుమలత

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు కామారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జిగా సుర సుమలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆలేరు(భువనగిరి)లో సీనియర్ సివిల్‌జడ్జిగా పనిచేసిన ఈమె బదిలీపై కామారెడ్డికి వచ్చారు. ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన టి.నాగరాణిని కామారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ రెగ్యులర్ మొదటి కార్యదర్శిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చింది. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పర్యవేక్షకుడు జె.భుజంగ్‌రావు, కోర్టు సిబ్బంది శ్రీధర్, ఆనంద్ శాంతిశ్రీ, రజనీప్రియ, కరుణ తదితరులు సుమలతకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



బాధ్యతలు చేపట్టిన సుర సుమలతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కోర్టు సిబ్బంది

టి.నాగరాణి బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి నేరవిభాగం: కామారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ రెగ్యులర్ మొదటి కార్యదర్శిగా టి.నాగరాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షకుడు చంద్రసేన్‌రెడ్డితో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా విస్తృత న్యాయ సేవలు అందించేందుకు ఇదో సువర్ణ అవకాశమన్నారు. ప్రతి కక్షిదారుడికి సరైన సమయంలో న్యాయం అందేలా కృషిచేస్తామన్నారు.



బాధ్యతలు తీసుకున్న టి.నాగరాణికి మొక్క అందజేస్తున్న చంద్రసేన్‌రెడ్డి తదితరులు

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

● 37 తులాల బంగారు ఆభరణాలు, నగదు లూటీ


కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగిన ఘటన జిల్లాకేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో మంగళవారం రాత్రి వెలుగుచూసింది. కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముండే ఆర్నె యోగేష్ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 21న ఇంటికి తాళం వేసి వరంగల్ వెళ్లారు. ఈ నెల 22న సాయంత్రం పూట వారి బంధువులు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. యోగేష్ కుటుంబం హుటాహుటిన కామారెడ్డికి చేరుకున్నారు. ఇంట్లో దాచిన 37 తులాల బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. బుధవారం ఉదయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్ ఇతర పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మూడు బృందాలు దొంగల కోసం గాలిస్తున్నాయి.



దొంగతనం వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీసు అధికారులు

తమ్ముడిని చంపిన అన్నకు అయిదేళ్ల జైలు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: తమ్ముడిని హత్య చేసిన అన్నకు అయిదేళ్ల జైలు శిక్షను విధిస్తూ అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ బుధవారం తీర్పునిచ్చారు. జిల్లా ఎస్పీ సింధుశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన అల్లం ప్రభాకర్ మద్యానికి బానిసై తరచూ గొడవపడేవాడు. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తమ్ముడు శివకుమార్‌ను 2022 అక్టోబర్ 1న కర్రతో కొట్టి హత్య చేశాడు. శివకుమార్ తండ్రి మధుకర్ ఫిర్యాదు మేరకు నస్రుల్లాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో ప్రభాకర్‌కు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. నిందితుడికి శిక్ష పడేలా వాదనలు వినిపించిన పీపీలు దామోదర్‌రెడ్డి, శేషు, పోలీసు అధికారులను, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై మురళి, సీడీవో కిషన్, సలేష్ తదితరులను ఎస్పీ అభినందించారు.



బియ్యం లారీల బారులు

చిత్రంలో కనిపిస్తున్న బియ్యం లారీలు పాత రాజంపేట ఎఫ్‌సీఐ గోదాం ముందరవి. మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందజేయడానికి లారీల్లో ఇలా తీసుకువచ్చారు. అయితే అధికారులు కొర్రీలు పెట్టడంతో లారీలు ఆలస్యంగా అన్‌లోడ్ అవుతున్నాయి. నాలుగురోజుల నుంచి లారీలు గోదాం ఎదుట ఇలాగే ఉంటున్నాయి. లారీల అద్దెభారం తమపై పడుతుందని, సీఎంఆర్ వేగంగా తీసుకుంటే మిల్లుల్లో ఖాళీ స్థలం ఏర్పడి కొత్త ధాన్యాన్ని తీసుకునే అవకాశం ఉందని మిల్లర్లు పేర్కొంటున్నారు.

న్యూస్‌టుడే, కామారెడి కలెక్టరేట్

కాలభైరవ ఆలయంలో మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

ఇస్సన్నపల్లి(రామారెడ్డి), న్యూస్‌టుడే: ఇస్సన్నపల్లి, రామారెడ్డిలోని కాలభైరవ స్వామి ఆలయంలో కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని గత గురువారం 'ఆదాయం ఘనం... వసతులు శూన్యం' పేరుతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. ఈవో ప్రభు రాంచంద్రం స్పందించి మరుగుదొడ్లను శుభ్రం చేయించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్ — ఈనాడు సినిమాలు

వేట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15
విశ్వం 11.00 2.00 6.00 9.00

వీ సినిమాస్ : దేవర 5.50 9.15

ఏషియన్ దర్శన్ : మార్టిన్ 6.00, 9.00


– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242




✪✪✪: పట్టణంలోని శాంతి నగర్‌కాలనీలో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్త నిల్వలతో నిండిపోవడంపై స్థానికుడు విజయ్ ఫిర్యాదుచేయగా పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు స్పందించి సమస్య పరిష్కరించారు.






✪✪✪: రెడ్డిపేట్ గ్రామంలో చెత్తచెదారంతో దుర్వాసన వస్తోందని కొన్ని రోజుల క్రితం మేమున్నాం మీకు తోడుగాలో సమస్య ప్రచురితమవగా పంచాయతీ కార్యదర్శి నరేష్ స్పందించారు. బుధవారం సిబ్బందితో వ్యర్థాలు తీసివేయించారు.



✪✪✪: తుజాల్‌పూర్‌లో 7వ వార్డులో రెండు వరుసల రోడ్డు పక్కన మురుగు కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదు.
- అంజనేయులు(తుజాల్‌పూర్)

✪✪✪: కార్మికులతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాం. **- రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి**

✪✪✪ కామారెడ్డి గాంధీనగర్ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగాయి.
- శ్రీకాంత్, గాంధీనగర్



✪✪✪ పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టాం.
- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

✪✪✪ ముత్యంపేటలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. **- సిద్ధరాములు, స్థానికుడు, దోమకొండ (మం)**

✪✪✪దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- సంజయ్‌రావు, గ్రామ ప్రత్యేకాధికారి, ముత్యంపేట**

✪✪✪ పిట్లం రైతు వేదిక పరిసరాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. **హన్మాండ్లు, స్థానికుడు**

✪✪✪: పిచ్చి మొక్కలు తొలగించేయిస్తాం. **కమల, ఏవో, పిట్లం.**

-న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం, పిట్లం, రామారెడ్డి, దోమకొండ, బీబీపేట,

గుంత పూడ్చరూ..!



దోమకొండ మండలం ముత్యంపేటలోని బస్టాండు రోడ్డు వద్ద గుంత ప్రమాదాలకు పిలుపునిస్తోంది. వర్షం పడిన సందర్భంలో గుంతలో నీరు నిలిచి పెద్దగా మారుతోంది. గుంతను దాటించాలని ప్రయత్నం చేసిన ద్విచక్రవాహనదారులు జారి పడుతున్నారు. దీనిని తాత్కాలికంగా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే,దోమకొండ

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో చేపట్టే అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును బుధవారం నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. మినీ స్టేడియం ఏర్పాటు, మంచినీటి సమస్య, చెరువు అభివృద్ధి పనుల వివరాల గురించి పార్టీ అధికార ప్రతినిధి షౌకత్ అలీ, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్యాంరావు తదితరులు ఎమ్మెల్యేతో చర్చించారు. వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లకు చెందిన కొల్పుల కాశీరాం అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి మున్సిపల్ మాజీ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ రూ. 5వేల ఆర్థిక సహాయం అందించారు. వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు సామెల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, భాస్కర్, రాజయ్య, కాశీరాం తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేతో తాడ్వాయి మండల నాయకులు షౌకత్‌అలీ, శ్యాంరావు

పనులు జాప్యం... ప్రమాదాలు నిత్యకృత్యం



న్యూస్‌టుడే,రామారెడ్డి

రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మ వాగు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ. 3.08కోట్లు మంజూరు చేసింది. గుత్తేదారుడు పనులు ప్రారంభించి సంవత్సరం గడిచినా పనులు పూర్తి కాకపోవడంతో చోదకులు గాయాలపాలవుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. వంతెన వద్ద సర్వీస్ రోడ్డు తాత్కాలికంగా వేయడంతో భారీ వాహనాల రాకపోకలు సాగడం లేదు. చుట్టూ తిరిగి కామారెడ్డి వెళ్లాల్సి వస్తోంది.



సోమవారం రాత్రి బోల్తా పడిన ధాన్యం లారీ

వర్షాలకు సర్వీస్ రోడ్డు కోతకు గురైంది. చెంతనే పొలాలు ఉన్నా పది కిలోమీటర్లు తిరిగి రైతులు వెళ్తున్నారు.



నత్తనడకన సాగుతున్న గంగమ్మ వాగు వంతెన నిర్మాణం

రహదారిని విస్తరిస్తాం

రవితేజ, ఏఈ

గంగమ్మ వాగు వంతెన వద్ద సర్వీస్ రోడ్డు వెడల్పు చేయిస్తాం. వంతెన పనులు త్వరగా పూర్తి చేసేలా గుత్తేదారుడికి ఆదేశాలు జారీ చేస్తాను. మరమ్మతులు చేసే వరకు భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తాం.

వాహనాల బోల్తా...

గత సోమవారం అధిక లోడుతో వెళ్తున్న ధాన్యం లారీ బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవరు సురక్షితంగా బయటపడ్డారు. శనివారం రాత్రి సైతం వరి కోత యంత్రం బోల్తా పడింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. సర్వీస్ రోడ్డు చిన్నగా ఉండడంతో ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులను పోసానిపేట్ మీదుగా మళ్లించడంతో పోసానిపేట్, రంగంపేట్, గొల్లపల్లి ప్రజలకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పోసానిపేట్ గ్రామంలో సింగిల్ రోడ్డు ఉండడంతో బస్సులు ఎదురుగా వస్తే రాకపోకలు సాగించలేని పరిస్థితి. పోసానిపేట్ చౌరస్తా వద్ద రెండు నెలల్లో ఆరు ప్రమాదాలు జరిగాయి. కొందరికి గాయాలు కాగా, ఒకరు మరణించారు. వంతెన నిర్మాణం ఆలస్యం కావడంతో ధర్పల్లి, సిరికొండ, రామారెడ్డి మండల ప్రజలకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



గోపాల్‌పేట్‌లో నడి రోడ్డుపై కోతుల గుంపు

వానర దండు...

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో వానరాల బెడద రోజురోజుకు పెరుగుతోంది. మహిళలు, చిన్నారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ప్రతిరోజు వీటి బారిన పడి పలువురు గాయాలపాలవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా.. త్వరలో వాటిని పట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే,నాగిరెడ్డిపేట**



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అయోడిన్ ఉప్పుతో ఆరోగ్యం

లింగంపేట, న్యూస్‌టుడే: అయోడిన్ ఉప్పు వినియోగిస్తే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని వైద్యాధికారిణి హిమబిందు తెలిపారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. అయోడిన్ లోపిస్తే జ్ఞాపకశక్తి తగ్గడం, గర్భధారణ సమస్యలు తలెత్తుతాయని చెప్పారు.



బీబీపేట ఠాణాలో..



మాచారెడ్డిలో..



కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు తుపాకీ పనితీరును వివరిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి



దోమకొండ ఠాణాలో..

పోలీసుస్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు

అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీసుస్టేషన్లలో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఠాణా నిర్వహణ, రికార్డులు, ఆయుధాలు, పోలీసు వాహనాలు, కేసుల వివరాలు, రిజిస్టర్ల నిర్వహణ గురించి పోలీసులు విద్యార్థులకు వివరించారు. **- న్యూస్‌టుడే, బృందం**

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని నేషనల్ హైవే సిద్దిపేట ఆర్ అండ్ బీ ఈఈ బాల రామకృష్ణ పేర్కొన్నారు. నస్రుల్లాబాద్ మండలంలో జరుగుతున్న 775డీ రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల్లో రాజీ పడొద్దని సూచించారు. అనంతరం బీర్కూర్ తెలంగాణ తిరుమలను దర్శించుకున్నారు. డీఈఈ ప్రవీణ్ రెడ్డి, ఏఈఈ శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న నేషనల్ హైవే సిద్దిపేట ఆర్ అండ్ బీ ఈఈ బాల రామకృష్ణ

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: నూతనంగా ఎన్నికైన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డిని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి బుధవారం సన్మానించారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగరాజు, దేవరాజు, సాయిలు, లక్ష్మణ్ తదితరులున్నారు.



ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

సుల్తాన్‌నగర్(నిజాంసాగర్): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తెలిపారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ సొసైటీ పరిధిలోని సుల్తాన్‌నగర్‌లో బుధవారం వరికొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు అనీస్, రాముురాథోడ్, రమేష్, బ్రహ్మం, మహిపాల్‌రెడ్డి, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లికార్జున్

ఏడీఈ, ఏఈలకు సత్కారం

బీబీపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ ఏడీఈ కిరణ్‌చైతన్య, ఏఈ దివ్యగాయత్రి ఇటీవల బదిలీ కాగా వారిని బీబీపేటలో సిబ్బంది బుధవారం సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఏఈ రమణారెడ్డిలకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సబ్ ఇంజినీర్ చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

లింగంపేట: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని బోనాల్ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేశారు. పశువైద్య సహాయకులు రవి, గోపాల మిత్ర ఎజాజ్, రమేష్ పాల్గొన్నారు

ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి కృషి

గాంధారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఎల్లప్పుడు కృషి చేస్తుందని మండలాధ్యక్షులు బర్మవత్ ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలో వంగ మహిధర్‌రెడ్డి ని గెలిపించుకోవాలన్నారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర బాధ్యులు రమేష్, శ్రీనివాస్, చిరంజీవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బండి రాజులును సన్మానిస్తున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

మాచారెడ్డి: పల్వంచ మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా అంతయ్య, ప్రశాంత్, మహిపాల్ ఎన్నికయ్యారు.

ప్రధానోపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బుడ్మి జడ్పీ పాఠశాల హెచ్‌ఎంను వెంటనే విధుల నుంచి తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ పాఠశాలలో విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించకూడదని చెప్పడంతో గ్రామస్థులు మండిపడ్డారు. వెంటనే పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎంను నిలదీశారు. ప్రధానోపాధ్యాయుడి తీరుపై హిందూ సంఘాలు బుడ్మి చౌరస్తాలో ధర్నాకు పిలుపునివ్వడంతో ఉద్రిక్తత చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. హెచ్‌ఎంను పాఠశాల నుంచి బదిలీ చేసి మైనార్టీ పాఠశాలలో మాత్రమే అవకాశం కల్పించాలని గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు.



సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

రెడ్‌క్రాస్ సభ్యత్వాలు పెంచాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యత్వాలు పెంచాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. రెడ్‌క్రాస్ ద్వారా సామాజిక కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, సీపీవో రాజారాం, జిల్లా సంక్షేమాధికారి బావన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ స్టేడియంలో ఇటీవల వర్షాలకు ఏర్పడిన గుంతలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పూడ్చివేయించారు. గుంతలు ఏర్పడంతో క్రీడాకారులకు, ఉదయం నడకకు వచ్చే వారికి ఇబ్బందులు ఉండేవి. విషయం తెలుసుకున్న ఛైర్‌పర్సన్ గుంతలను పూడ్చివేయించారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశీ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలి

సదాశివనగర్, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని డీఈవో రాజు అన్నారు. సదాశివనగర్ మండలం కల్వరాల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, మధ్యాహ్న భోజనంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. వెంట డీసీఈబీ కార్యదర్శి లింగం, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, సుజాత, ఉపాధ్యాయులు సంతోష్‌శర్మ తదితరులు ఉన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాజు

కళాజాత ప్రదర్శన

భిక్కనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై జంగంపల్లి, తలమడ్ల గ్రామాలలో అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు పాటలతో వ్యాధి తీవ్రత పరిణామాలను ప్రజలకు వివరించారు. వ్యాధి నియంత్రణ మార్గాలను డీపీఎం సుధాకర్ ప్రజలకు వివరించారు. శివరాం, సవిత, నవీన్, శ్రీరామ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి

పిట్లం, న్యూస్‌టుడే: పిల్లలు చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హసద్ అన్నారు. పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. నిత్యం కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. అధ్యాపకులు నరేశ్, రంజిత్, వెంకటేశ్వర్లు, రాజారాం తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కామారెడ్డి డివిజన్‌లో విద్యుత్తుశాఖ ఎంఆర్‌టీ ప్రొటెక్షన్ ఏఈగా ప్రదీప్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదివరకు కామారెడ్డి పట్టణం, దోమకొండ మండలాల్లో ఏఈగా విధులు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఈని ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఏడీలు జైరాజ్, సతీష్, మల్లేష్, హన్మంత్‌రెడ్డి, ఏఈ గాయత్రి పాల్గొన్నారు.



ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు



బెల్ట్ దుకాణం నిర్వాహకులపై కేసు

భిక్కనూరు, న్యూస్‌టుడే: జంగంపల్లి గ్రామంలో అక్రమంగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు బెల్ట్ దుకాణాల నిర్వాహకులు రామాయంపేట ప్రవీణ్ గౌడ్, నరేష్‌గౌడ్‌లపై కేసు నమోదు చేశారు.

ఆబ్కారీ సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు

దోమకొండ, న్యూస్‌టుడే: అంబారిపేటలో కల్తీ కల్లు, అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు దోమకొండ ఆబ్కారీ సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కల్లు డిపోలో నమూనాలు సేకరించి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని ఆరోపణలపై అనుమానాస్పద వ్యక్తి దుకాణాన్ని పరిశీలించగా.. మద్యం దొరకలేదని పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: పెద్దకొడప్‌గల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో జూదమాడుతున్న 9 మందిని స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ. 20,170 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని వాహనదారుడితోపాటు మరో వ్యక్తి గాయపడిన ఘటన రామాయంపేట పట్టణ పరిధి కోమటిపల్లి జాతీయ రహదారి వద్ద బుధవారం రాత్రి జరిగింది. రాజంపేటకు చెందిన కరీం ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళుతున్నాడు. కోమటిపల్లికి చెందిన గోపి రామాయంపేట నుంచి ఆటోలో దిగి జాతీయ రహదారి పక్కన ఉన్నాడు. కరీం ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టి అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు.



ఎల్లారెడ్డి : హిందూ సంఘాల ర్యాలీ



నిజాంసాగర్‌లో..

బంద్ విజయవంతం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : హిందూ దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనను నిరసిస్తూ ఎల్లారెడ్డిలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. ధార్మిక సంఘాల పిలుపుతో పట్టణంలో వాణిజ్య, వ్యాపార సంస్థలు పూర్తిగా మూతపడ్డాయి. ప్రధాన రహదారుల మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు.

నిజాంసాగర్, న్యూస్‌టుడే: మండలంలోని పెట్రోల్‌బంకులు, ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. బందోబస్తులో బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్, నిజాంసాగర్, పిట్లం, బీర్కూర్ ఎస్సైలు సుధాకర్, రాజు, రాజశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్: జుక్కల్ బజార్ హనుమాన్ మందిరం నుంచి రామ్ మందిరం, బసవేశ్వర్ చౌక్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. దుకాణాలు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ రావు బందోబస్తు నిర్వహించారు.



జుక్కల్‌లో మానవహారం